# బడి గంటలు మోగిన వేళ.!

## మొదటి రోజు.. ఉత్సాహంగా విద్యార్థులు



పాఠశాలలోని తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు





అడ్మిషన్ కోసం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థినికి పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మొదటి రోజు పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నా పలు పాఠశాలల్లో 50 శాతానికి మించి విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. మొదటి రోజు కావడంతో కాస్త హాజరు శాతం తగ్గిందన్నారు. రెండు మూడు రోజుల్లో 90 శాతం హాజరవుతారని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జనతానగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో అడ్మిషన్స్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి విద్యార్థులకు ప్రభుత్వ పుస్తకాలు అందజేశారు. మరికొన్ని పాఠశాలల్లో మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. - మూసాపేట్



సంతోషంగా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు







కూకట్‌పల్లిలోని పీఎన్ఎం హై స్కూల్‌లో విద్యార్థులకు పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయురాలు

## సర్కారు బడి పిల్లలకు కార్పొరేటర్ స్వాగతం

**మోతీనగర్:** వేసవి సెలవులు పూర్తి చేసికొని తిరిగి పాఠశాలలకు విచ్చేసిన విద్యార్థులకు బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ మహేందర్ స్వాగతం పలికారు. అనంతరం వారికి పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలలో కనీసం రెండుసార్లు అయినా పాఠశాలకు వచ్చి విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ఆరా తీయాలన్నారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు విశాల, సత్యనారాయణ, దీపిక, అనిల్, సరోజిని, నాయకులు మల్లేష్‌గౌడ్, డాకయ్య, ఎర్ర స్వామి, భాస్కర్, అవిలయ్య, బసవరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

## సీసీరోడ్డు పనుల పరిశీలన

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇంద్రహిల్స్, మహంకాళినగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్ల ప్రాంతాలను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ వద్ద సీసీ రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి వాటర్ లీకేజ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ సీసీ రోడ్డు విషయం గురించి అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ నాయక్, ఏఇ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లోని భూనీల సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రుత్విక్ వర్ణం, యాజమాన్య దీక్షా స్వీకరణ, నివేదన, మంగళశాసనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

## 'శ్రీ మహానంది అవార్డు రావడం ఆనందంగా ఉంది'



శ్రీ మహానంది అవార్డును పిట్ల రాజుకు అందజేస్తున్న దైవజ్ఞశర్మ

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** శ్రీ మహానంది అవార్డు రావడం ఆనందంగా ఉందని.. మరింత బాధ్యతను పెంచిందని తెలంగాణ ముదిరాజు మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు పిట్ల రాజు అన్నారు. రవీంద్రభారతిలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు శ్రీ మహానంది అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న పిట్లరాజును నాయకులు, దైవజ్ఞశర్మ కలసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## ప్రీస్కూళ్లుగా.. అంగన్‌వాడీ సెంటర్లు!

- మొదటి విడతగా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న కేంద్రాలకు అవకాశం
- రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రతిపాదన



ఖాజాగూడ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్ భవనం ఇదే..

**రాయదుర్గం:** అంగన్‌వాడీ సెంటర్ల దశ తిరగనుంది. వీటిని ప్రీస్కూళ్లుగా మార్చాలనే అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దశలవారీగా ప్రీస్కూళ్లుగా మార్చడానికి తగిన మార్గదర్శకాలు విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం, నానక్‌రాంగూడలలో ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ సెంటర్లు కొనసాగుతుండగా, మిగతా చోట్ల కొన్నింటిని స్థానిక కమ్యూనిటీహాళ్లలో ఏర్పాటు చేశారు. కాగా జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో కొనసాగే వాటిని కూడా మొదటి విడతలోనే ప్రీస్కూళ్లుగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఈ చర్యలు తీసుకుంటే ఎంతో మేలు**

- అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా మారిస్తే వీటిలో ఎల్‌కేజీ, యూకేజీ తరహాలో విద్యార్థులకు బోధన చేసే వీలు ఉంటుంది.
- దీని కోసం శిక్షణ పొందిన ఉపాధ్యాయులనే నియమించాల్సి ఉంటుంది. అలా కాకుండా ప్రస్తుతమున్న అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ అందించి, వేతనాలు పెంచి వారికే అవకాశం కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతో బాటు జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్న వాటికి కూడా అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.
- ప్రీస్కూళ్లను కొనసాగిస్తూ, అంగన్‌వాడీ సెంటర్లు కూడా కొనసాగేలా చర్యలు తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కూడా సెంటర్ ఉండేలా చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### పాఠశాల మరమ్మతుల పరిశీలన



**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీ, 3వ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు పుస్తకాలను అందజేశారు. అనంతరం బడిలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, సెక్రటరీ ఫణికుమార్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అక్రమ గుడారాల తొలగింపు



**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలు, దుకాణాలను అధికారులు తొలగించారు. బుధవారం కేపీహెచ్‌బీకాలనీలోని ఫేజ్– 2, 3, నేతాజీ పార్కు వద్ద వెలసిన గుడారాలు, దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అనుమతులు లేని నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపాలి




మాట్లాడుతున్న హెచ్‌ఎం కె. రాధా పద్మజ

**ఆల్విన్‌కాలనీ:** ప్రతి విద్యార్థి పాఠశాలకు తప్పకుండా వచ్చేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రాధా పద్మజ అన్నారు. బుధవారం నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం తెలియజేస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పరంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్ ఈ సంవత్సరం నుంచి నూతనంగా నోటు పుస్తకాలు, రాగి జావా, మధ్యాహ్న భోజనం వంటివి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ప్రతి మూడో శనివారం పేరెంట్ టీచర్స్ సమావేశం ఉంటుందన్నారు. ప్రతి సమావేశానికి తల్లిదండ్రులు తప్పకుండా విచ్చేసి విద్యార్థుల చదువుకు సంబంధించిన సలహాలు, సూచనలు చేయాల్సిందిగా కోరారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు.ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దుర్గా భవాని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎల్లమ్మబండ జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు

## గురుకుల కొత్త టీచర్ల ఎదురు చూపులు

### పోస్టింగ్ తేదీలను వెల్లడించాలని డిమాండ్

**ఉస్మానియాయూనివర్సిటీ:** ఉద్యోగాలు వచ్చాయని చేసే పనులు మానుకొని పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నామని ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు ఎంపికైన కొత్త టీచర్లు వాపోతున్నారు. బుధవారం ఓయూలో వారు మాట్లాడుతూ..గురుకుల టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లకు పోస్టింగుల పక్రియను వేగవంతం చేయాలన్నారు. గతేడాది ఆగస్టు నెలలో పరీక్ష రాసి ఎంపికైన అభ్యర్థులకు 2024 మార్చి 4న ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్న నియామకపు పత్రాలను 60 రోజుల్లో ఉద్యోగంలో చేరాలని పేర్కొన్నారని కానీ..100 రోజులు గడుస్తున్న ఇంత వరకు ఎలాంటి కదలిక లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ ఉద్యోగ నియామకపు పత్రాలు అందుకున్న సుమారు 5000 మంది అభ్యర్థులు మూడు నెలలుగా నిరీక్షిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న తర్వాత చేసే పనులను మానుకొని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన. ఎన్నికల కోడ్ ముగిసినా టీచర్ల పోస్టింగ్‌ల పక్రియ పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గురుకుల్లో ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకు త్వరితగతిన పదోన్నతులు, బదిలీల పక్రియను పూర్తి చేసి కొత్త వారికి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. లేదా ఇంకా సమయం తీసుకుంటే తేదీలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

## 14 నుంచి హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్

**ఉస్మానియాయూనివర్సిటీ:** ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రేపటి (14న) నుంచి మూడు వారాల పాటు హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్న కార్యదర్శి, బీసీసీఐ లెవల్–1 కోచ్ ప్రొ.సత్యనారాయణ తెలిపారు. నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో రేపు (14న) ఉదయం 7 గంటలకు రెండు రోజుల లీగ్ మ్యాచ్ జరుగుతాయని ఓయూ కాలేజీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనను న్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8520011662, 9000627456 నం సంప్రదించాలన్నారు.

## వీసీల నియామకాల్లో ఆలస్యంపై ఆందోళన

**ఉస్మానియాయూనివర్సిటీ:** రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీల నియామకాలలో జాప్యం పట్ల సీనియర్ అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 15 వరకు వీసీలను నియమిస్తారనే ఆశతో ఎదురు చూసిన ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వం నియామకపు ప్రక్రియను ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా వీసీల నియామకానికి ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ సభ్యులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ తరపున ఒక్కొక్కరిని నియమించగా యూనివర్సిటీల పాలక మండలి (ఈసీ) నుంచి మూడో వ్యక్తిని సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తారు. అయితే వర్సిటీలు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులపై వీసీ పదవీకి దరఖాస్తు చేసుకున్న ప్రొఫెసర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. ఎందుకంటే వర్సిటీ పాలక మండలి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తారు.. సెర్చ్ కమిటీ సభ్యుని నియామకంలో వీసీదే కీలక పాత్ర. వారికి అనుకూలమైన వ్యక్తులను సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించుకోవచ్చు. అయితే పదవీ కాలం ముగిసిన కొందరు మరోమారు వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తాము పదవీలో ఉన్నప్పుడు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులు ఇప్పుడు వారికి అనుకూలంగా వ్యవహరిస్తారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## బీసీ కులగణన ప్రక్రియను ప్రారంభించాలి

**ఉస్మానియాయూనివర్సిటీ:** బీసీ కులగణన పక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబరు.26 తీసుకొచ్చి బీసీ కుల గణనకు బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించిన అంశాన్ని గుర్తు చేశారు. కులగణన చేపట్టి కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## శ్రీరామకథ పారాయణం




రామ నామం జరపెంచినా.. లిఖించినా.. పలికినా అది పూర్వజన్మ సుకృత పుణ్యమేనని సంపన్న పంచయోగి తపస్వి మదన్‌మోహన్ దాస్ మహారాజ్ పేర్కొన్నారు. బుధవారం సంకట మోచన హనుమాన్ దేవాలయంలో శ్రీరామ కథ ప్రచారం నిర్వహించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు రామ కథ విశేషాలను మదన్‌మోహన్ దాస్ మహారాజ్ భక్తులకు వివరిస్తున్నారు. ఈనెల 16 వరకు రామకథ పారాయణం ఉంటుందని తెలిపారు. - మోతీనగర్

## కల్యాణం.. కమనీయం

భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో బుధవారం లక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అదే విధంగా గురువారం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శుక్రవారం చక్రతీర్థం వంటి పూజ కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. -మూసాపేట



భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 16 వరకు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా డయాబెటిస్ క్యాంప్ జరుగనుంది. కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులో బుధవారం ఈ యోగా తరగతుల్లో యువత, పెద్దలు పాల్గొన్నారు. - కూకట్‌పల్లి

## యోగారోగ్యం

